# టెంకిజెల్ల

కోర్టు -

జడ్జి వొచ్చి ఆసనాన్నలంకరించారు. లాంఛనాలు ముగించి తన సీటులోకి వెళ్ళి కూర్చున్నాడు బెంచి క్లర్కు.

న్యాయమూర్తి కేసుకు సంబంధించిన న్యాయవాది వేపు చూశారు ప్రారంభించమన్నట్లు.

లాయర్ లేచినిలుచుని- "యువరానర్! మా క్లయింటు స్వయంగా చెప్పుకోవాలని అభిలషిస్తున్నాడు" అన్నాడు.

అలాగే అన్నట్లూ అనుమతిస్తున్నట్లూ తల ఊపి - ఫిర్యాది వేపు చూస్తూ అడిగాడు జడ్జి "మీ పేరు?"

"భజగోవిందం"

"ఏం చేస్తుంటారు!"

చెప్పాడు ఫిర్యాది.

"మీ ఫిర్యాదేమిటి?"

"నాకు విడాకులు కావాలి. నా భార్యనుంచి విముక్తీ స్వేచ్ఛా కావాలి." గొణిగాడు. న్యాయాధీశులు ఆశ్చర్యపోయారు. "మీరెందుకని విడాకులు కోరుకుంటున్నారు?"

భజగోవిందం సిగ్గు పడుతూ తల వొంచుకున్నాడు. "అది... ఆ విషయంలో... నేను మీకు రహస్యంగా చెప్పాలని..."

జడ్జి కరుణించినట్లు- "దగ్గరగా వొచ్చి చెప్పండి." అన్నాడనుమతిస్తూ. భజగోవిందం జడ్జిగారి బల్లముందుకు నడిచాడు. ఇప్పుడు వారి మాటలొకరి వొకరికి మాత్రమే వినపడతాయి. "మీరెందుకు విడాకులు కోరుతున్నారు!" "నా భార్య పెడుతున్న చిత్ర హింస భరించలేక." గద్గదికమైందతని కంఠం.

"ఏమిటా చిత్ర హింస?"

"యువరానర్! మనం మగవాళ్ళం. పక్షానికో నెలకో మన నెత్తిమీద జుత్తు తెగ పెరిగిపోతుంది గడ్డి దుబ్బుల్లాగ. ఫ్యాషన్ కుర్రాళ్ళ సంగతి వదిలేస్తే- మన బోంట్లకి సకాలంలో క్షవరం చేయించుకోపోతే- మెడ వెనుకా అక్కడా మహా చికాకుగా ఉంటుంది. ఎంతో చీదరగా అనిపిస్తుంది అసౌకర్యంగా అసహ్యంగా ఉంటుంది. క్షవర కళ్యాణ ముహూర్తం ఏ కారణాల వల్ల నేనా నాలుగు రోజులాలశ్య మయిందో చెప్పనే అక్కర లేదు ఏమంటారు?"

"అక్కడకే వొస్తున్నాను యువరానర్, నిర్మొహమాటంగా... నిష్కర్షగా... శుభ్రంగా... కేశాలను

కోయించుకొని... జుత్తు కంటకత్తెర వేయించుకుంటే- బుర్ర తేలికపడి... పుర్రెకు గాలి తరుగులుమహా హాయిగా ఉంటుంది - వేసవిఎండలో గంటల తరబడి తిరిగొచ్చి బూట్లు, సాక్సు, టోపీ తీసేసి నప్పటిలాగా..."

"ఊఁ..."

"పదిహేనిరవై రోజుల కోసారి క్షవరానందం పొందడం నాకు చిన్నప్పటినుండి అలవాటు. నిజం చెప్పొద్దూ- నాకు మట్టుకు- క్షవరం కళ్యాణమే. క్షవరం చేయించుకొచ్చి తలమీంచి చన్నీళ్ళు పోసుకుంటూ చేసే స్నానంలోని సుఖం అత్యంత మధురానుభవమే మగవాడికి"

ఇక ఓపిక పట్టలేకపోయినట్లున్నారు న్యాయమూర్తి. "అదంతా సరే. దానికీ మీ విడాకులకీ సంబంధ మేమిటో సూటాగా చెప్పండి" విసుక్కున్నారు. "అదిగో అప్పుడే యువరానర్... నేను భార్యా బాధితుడినీ, పత్నీ పీడితుడినీ కావడం మొదలయ్యింది. మా ఆవిడ... అదో రాలుగాయి... రణపెంకి, మాటకారీ, మహమ్మారీ... కొంటిదీ, కోణంగిది. నేను క్షవరం చేయించుకుని స్నానం చేసి తల తుడుచుకుంటూ వస్తూంటే..." సిగ్గు పడిపోతూ... తల వొంచేసుకుని... గుసగుస లాడుతున్నట్లు... గొడిగాడు-" కొత్తెం మీద ఠఫీమని ఓ టెంకిజెల్ల యిస్తుంది. అబ్బ! ఎంత గట్టిగా... శబ్దం వచ్చేలా యిచ్చుకుంటుందనీ ఆ టెంకిజెల్ల!

త్రుళ్ళిపడ్డారు జడ్జి. కుర్చీలోంచి ముందుకి వంగారప్రయత్నంగానే.

భజగోవిందం మళ్ళీ సాగించాడు. "వొద్దే... తప్పే... మొగుణ్ణోమాటనొచ్చు కాని చెయ్యిచేసుకో కూడదే. సూర్యాకాంత మయినా సినిమాలో మొగుణ్ని సాధించుకు తినడం తప్ప కొట్టడం చేసిందా? నువ్వే ఆలోచించి, మొగుణ్ని మొట్టికాయ మొట్టడం కాని... టెంకి జెల్లిచ్చుకోడంకాని పతివ్రతా ధర్మాలు కావే-" అని నేను మొర పెట్టుకుంటే- నా ప్రార్థనని పెడచెవిని పెట్టేసి- "మగాళ్లు క్షవరం చేయించుకున్నాడు అదోలా... తమాషాగా... అసయ్యంగా...బలేగా ఉంటారు. అందుకే క్షవరం కొత్తెన్ని చూసేసరికెటువంటి వారికయినా టెంకిజెల్లిచ్చే బుద్దేస్తుంది. అలా జెల్ల లాగుతుంటే ఎంత సర్దాగా ఉంటుందో! మా అన్నలకీ తమ్ముళ్ళకీ యిచ్చేదాన్ని కదూ నాకు పెళ్ళి కాక ముందు? వాళ్ళు మీలాగ బాధపడిపోయి ఏడుపుముఖం పెట్టేవారు కారూ! మీరే వారూ ఏమన్నా అనుకుని ఏడ్చిపోతారని కానీ మీ స్నేహితులు క్షవరం చేయించుకున్న నాడొచ్చినా వొక్క టెంకిజెల్లిద్దామని ముచ్చటపడిపోతుంది నా మనసు.

"మేమే కదా మగాళ్ళం, మాకే కదా క్షవరయోగముందని గొప్పయిపోకండి. కావాలంటే... నేను కాదంటే అడగండి. క్షవరం జెల్లకే అంతయిదయిపోతారేం?" అంటూ ఎదురుతిరిగి మరో టెంకిజెల్లేస్తుంది ఫట్మంటూ కొత్తెం మీద. తను రోజంతా క్షవరం జెల్లలు కొట్టచ్చుకదాసి- నన్ను- వారానికే, పదిరోజులకీ కూడా క్షవరానికి తరుముతుంది. పోనీ ఓ జెల్లతో సరిపెడుతుందా అంటే అబ్బే... ఆ రోజంతా దొరికితే చాలు టెంకిజెల్ల కొట్టితీరిందే. పక్క నెవరున్నారనేది కూడా చూడదు. సమయమూ సందర్భమూ మంచీ చెడ్డా ఏవీ గమనించదు. పిల్లల ముందు.. స్నేహితుల ముందు... నేనిప్పటికెన్ని క్షవరం జెల్లలుతిన్నానో, నా పరువెంతపోయిందో! నేనెంత మగాడినయినా, పెళ్ళయిపోయిన వాడినయినా నాకూ ఆత్మాభిమానం ఉంది. పెళ్ళాం నుంచి టెంకిజెల్లలనూ క్షవరం జెల్లలను తప్పించుకుని... అవమానాలనుంచి బయటపడి... శేషజీవితమయినా ఆత్మాభిమానంతో... మనిషిగా.. బతకాలనుకుంటున్నాను. అందుకావిడ నుంచి విడాకులు పొందడం వినా మార్గమేముంది?

సహృదయంతోను సాటి మగవాడిగా నన్నర్థం చేసుకోండి. నాకీ మాత్రపు అదృష్టాన్నయినా ప్రసాదింపరా యువరానర్?" ఏడిచేశాడు భజగోవిందం.

'ఎంత అదృష్టవంతులు మీరు భజగోవిందంగారూ!" ఒక్కసారాగి..." ఇప్పటికే మీరెంతో అదృష్టవంతులు. నేను మీ కింకా ఏం అదృష్టం ప్రసాదించలను?" అన్నారు న్యాయమూర్తి. భజగోవిందం తెల్లబోయాడా మాటలకి.

క్షవర క్షవరానికి కట్టుకున్న దానిచేత కందుజెల్లతో టెంకిజెల్లలో తినడం అదృష్టమా! "ఒక్కటి నిట్టూర్పు నిట్టూర్చి... ముక్కు చీది... ఎగబీలుస్తూ మగవాడికి మగవాడే శత్రువని నిరూపిస్తున్నారు యువరానర్, మీరూ అంతే లెండి, మెత్తడి వాడినీ, తాజాగా క్షవరం చేయించుకున్నవాడినీ చూస్తే ఏవరికైనా టెంకిజెల్లలాగ బుద్ధి. మగ బతుకింతే.. ఇంతే.." అని వాపోయాడు.

"చూడండి భజగోవిందంగారూ! మీరు తొందరపడి అపార్థం చేసుకున్నారు నన్ను. క్షవరం–ఎంత తరచయినా పదిరోజులకో పదిహేను రోజులకో ఓసారి. అంతేనా?"

"అంతేను" వొప్పుకున్నాడతను.

"మరి గెడ్డమో? నాలాటి పెద్ద ఉద్యోగయిన కొందరు మగాళ్ళకి గెడ్డంకోత దైనందిన కార్యక్రమం. కొండకచో– రోజుకి రెండేసి సార్లు కూడా.."

"ఔనట, కొందరు సాయంత్రం కూడా గెడ్డం గీసుకుంటూంటారుట–"

"గెడ్డం గీసుకోగానే– అబ్బ! మీ చెంపలెంత నున్నగా మెరుస్తున్నాయి!"

మీ చెక్కిళ్ళద్దంలో ఎంతో నిగనిగలాడుతున్నాయి! మెత్తని వారిని చూస్తే మొత్తబుద్ధవుతుందో కాదో కాని– మెరిసే చెంపలని చూస్తూంటే చెంప దెబ్బెయ్యబుద్ధే. లెంపకాయలాగ బుద్ధే. ఇలాటి తాజా చెంపలని చూస్తూ చేతులు ముడుచుకు కూర్చోడం నా తరం కాదు బాబూ, అయినా మీరేమయినా పైవారా? నా మొగుడు. నా ఇష్టం." అంటూ తపతప.. ఎడాపెడా.... ఆ చెంపా ఈ చెంపా.. ముద్దుకు అయితే మాత్రం.. లెంపకాయలు లాగేసే అల్లరి, ఆగడపు అర్ధాంగి పాలబడకపోవడం మీ అదృష్టమూ, పూర్వజన్మ పుణ్యమూ కాదంటారా?" అంటూ చెంపలని నిమురుకుంటున్న అయనను చూసేసరికి.

"మిమ్మల్ని చూస్తూంటే నాకు చాలా అసూయగా ఉంది భజగోవిందం గారూ!" అంట్ను జడ్జిగారి మాటలు వినేసరికి– అతనికి చాలా కథ అర్థమై పోయినట్లు నిజంగా అదృష్టవంతుడే అని అనిపించింది.

"క్షవరాల కంటె గెడ్డాల సంఖ్యా తరుచుదనమూ ఎక్కువ. కనుక క్షవరం టెంకిజెల్ల కంటె గెడ్డం చెంపదెబ్బ మోటూ ఘాటూ ఎక్కువ. ఎంత జడ్జయినా మగాడే మొగుడే కనుక ఆవిడికి లోకువ. ఆయన పరిస్థితి కంటే నా పరిస్థితే నయం." అనుకుంటూ... జడ్జిగారి మీద జాలిపడుతూ....విడాకుల అభ్యర్థనను విరమించుకున్నట్లు చెప్పేసి– కోర్టునుంచి వెళ్ళిపోతున్న భజగోవిందాన్ని చూసి నవ్వుకున్నారు జడ్జి.

ఆయనకప్పటికే చక్కని సమయస్ఫూర్తి కలవారన్న పేరుంది కానీ–అప్పటికప్పుడు అక్కడికక్కడే కథ చెప్పేసి.. కథానుగుణంగా నటించేసి.. కేసుని విరమింపజేయించడం మాత్రం ఆయన సర్వీసులో అదే మొదటిసారి.

✡ ✡ ✡ ✡ ✡